కథా నిలయం
శ్రీకాకుళం

# కొత్త చెప్పులు

వ్యాపారి హృదయంలోని ద్రవ్యకాంతులా ఉంది ఉదయం.

ఆ రోజు శనివారం కావడంతో, రేడియోలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి సుప్రభాతం రాకమునుపే తలారా స్నానం చేశాడు నరసింహయ్య. చలువ ఖద్దరు దుస్తులు ధరించాడు. కాఫీ నీళ్లతో గొంతు కూడా తడుపుకోకుండా గుడికి బయలుదేరాడు.

హిమాయత్‌నగర్ సెంటర్లోకి వచ్చేసరికి సూర్య కిరణాల తెలుపుదనం హెచ్చింది. ఒక్క నిముషం ఆలోచించాడు నరసింహయ్య. నాలుగు ఫర్లాంగుల దూరం నడిచి వెళ్లడమా, రిక్షా ఎక్కి వెళ్లడమా? ఆయన ఆలోచన తెగకముందే ఓ రిక్షావాడు గంట వాయించుకుంటూ ఆయన ముందు వచ్చి నిలబడ్డాడు.

"సాబ్, రిక్షా...!"

"చిక్కడపల్లి గుడికి వస్తావా?"

"అచ్ఛా సాబ్, బైఠో!"

"ఎంత కొస్తావు?"

"ఆఠ్ అణా ఇప్పించండి."

"ఒరి నీ ఆశ మండిపోనూ! నాలుగడుగుల దూరానికి అర్ధ రూపాయా? ఈ లెక్కనైతే వేలకు వేలు పెట్టుబడి పెట్టి వ్యాపారం చేసే బదులు, రిక్షా తొక్కుకుని లక్షలు సంపాదించవచ్చు. పై పెచ్చు సేల్సుటాక్సు, ఇన్‌కంటాక్సు వాళ్ళ బెడద కూడా ఉండదు. ఇరవై పైసలిస్తాను, వస్తే రా, లేకపోతే ఫో"

అన్నాడు నరసింహయ్య, అరువు ఖాతాదారునికి ధర చెబుతూన్నంత ఖండితంగా.

'ప్రొద్దున్నే ఈ ఎండుకట్టె ఎదురైందేమిటబ్బా!' అనుకుంటూ ఆ రిక్షావాడు మళ్ళీ నోరెత్తి బేరమాడకుండా ఖాళీ రిక్షా తొక్కుకుంటూ వెళ్ళాడు.

తన పిసినారితనం మీద వాడు తుపుక్కున ఉమ్మి ఊసినట్టు న్యూనత పడ్డాడు నరసింహయ్య. ఆయనలో ఉక్రోషం ఉవ్వెత్తుగా లేచింది. కాళ్ళకు పని కల్పించాడు. 'ఈ వెధవలకు ఇరవై పైసలు మటుకు దండగెందుకు పెట్టాలి? తను డయాబిటిక్ పేషెంటు. నడిస్తేనే తన ఒంటికి మంచిది. అదీగాక శరీరశ్రమతో స్వామివారిని దర్శిస్తేనే పుణ్యమెక్కువ!' అనుకున్నాడు పట్టు చీరల వ్యాపారి నరసింహయ్య.

ఫర్లాంగు దూరం నడిచేసరికి కాళ్ళకున్న కొత్త చెప్పుల జత జ్ఞాపకానికి వచ్చింది. అప్పటికే ఆ చెప్పులు దుమ్ముకొట్టుకున్నాయి. నల్లగా నిగనిగ మెరిసేవి కాస్తా నివురు గప్పిన నిప్పులా తయారైనాయి. నరసింహయ్య ప్రాణం జాలితో జవ జవ లాడింది. నిన్న సాయంత్రమే వాటిని సుల్తాన్ బజారులో కొన్నాడు. 'రిక్షా ఎక్కితేనే పోయేదేమో!' అనుకోసాగాడు. మరుక్షణంలోనే 'పదిపైసలిస్తే మళ్ళీ కొత్త చెప్పుల్లాగా పాలిష్ పడతారు' అనుకొని తృప్తిపడ్డాడు. ఆ బిగువుతో నడుచుకుంటూ చిక్కడపల్లి దేవాలయం వరకూ వచ్చాడు.

కొండవీటి చాంతాడులా ఉంది క్యూ. శనివారం. అందులో సెకండ్ సాటర్ డే. నాలుగోతరగతి ఉద్యోగులంతా పిల్లా పీచుని వెంటవేసుకు వచ్చి ఉంటారు. రామ రామ, పాపం ఎట్లా పెరిగి పోతుందో. ప్రజలలో స్వామివారిపై భక్తి శ్రద్ధలుకూడా అట్లా

పెరిగిపోతున్నాయి. 'ఈ కలియుగంలో ఆ స్వామివారి అవతరణే లేకపోతే, దేశం అల్లకల్లోలంగా ఉండేది' అనుకున్నాడు నరసింహయ్య. ప్రతిశ నివారం ఆయన గుడికివెళ్ళి కొబ్బరికాయ కొడతాడు స్వామివారి ఎదట్ట నిలబడి ఆ వారంలో తెలిసీ, తెలియకా చేసిన పాపాలను పరిహరించమనీ, వచ్చేవారంలో విరివిగా వ్యాపారంలో లాభాలు చేకూర్చమనీ నిర్మోహమాటంగా ప్రార్థించి, దణ్ణం పెట్టుకుంటాడు. కట్టుగుడ్డలతో రాజధానికి వచ్చి, పదేళ్లలో పది లక్షలకు అధికారి అయిన ఆర్థిక స్తోమతు చిక్కిందంటే అంతా స్వామివారి అపార కరుణాదృష్టే అన్న విశ్వాసం నరసింహయ్య నరనరాలలో జీర్ణించిపోయింది.

గుడి ముందువీథిలో ఉన్న కొబ్బరికాయల కొట్టు దగ్గరికి వెళ్లి ఓ కొబ్బరికాయ, రెండు అరటిపండ్లూ, నాలుగు సాంబ్రాణి కడ్డీలూ, మూడు పువ్వులూ తీసుకున్నాడు నరసింహయ్య. కాని "చెప్పుల్ని ఎక్కడ విడవాలా?' అన్న సమస్య తీవ్రంగా ఎదురైంది.

ఆ కొట్టు ప్రక్కనే బజారు దుమ్ములో ఓ పదేళ్ళ కుర్రవాడు ఇరవై జతల చెప్పులకు కాపలా కాస్తూ గోనె పట్టామీద దుకాణం పెట్టుకుని కూర్చున్నాడు. వాడు అట్టముక్కల టిక్కెట్లు జారీ చేస్తున్నాడు. కాలెండరు అంకెలుగల ఆ అట్టముక్కల్ని ఒకటి చెప్పుల జతమీద పెట్టి, మరోటి ఆ చెప్పుల యజమాని చేతి కిస్తున్నాడు. వాడి వ్యాపారం కూడా క్రమ పద్ధతిలోనే ఉంది. వాడిముందు చెప్పులు విడిస్తే సురక్షితంగా ఉంటాయి. ఒకవేళ పోయినా పూచీ వాడిదే. పరిమిత బాధ్యతగల వ్యాపారం.

"ఒరేయ్, అబ్బీ! చెప్పుల కాపలాకు ఎంత పుచ్చుకుంటావు?" అన్నాడు నరసింహయ్య.

"మూడు పైసలండీ!"

"మూడు పైసలే! తల ఆడిస్తూ దీర్ఘంతీశాడు నరసింహయ్య.

"ఒక్క పైస ఇస్తాను. నా చెప్పులు చూడు."

"ఇందులో బేరం లేదండీ!" అన్నాడా కుర్రవాడు ఆయనకేసి చూడకుండానే.

'లతులతో వ్యాపారం చేస్తూన్న తనని ఆడింభకుడు బేరం లేదంటాడా?' అన్నకోపం నరసింహయ్య నడినెత్తికి అంటింది. వెంటనే కొబ్బరికాయల అంగడిపక్కన చెప్పులజతను విడిచీ, "ఇదిగో, అమ్మీ! నీ కొట్టు ప్రక్కనె నా చెప్పుల్ని విడిచాను. ఓకంట కనిపెట్టి ఉండు" అన్నాడు.

కొట్టుగలావిడ ఎవరిదగ్గరో కొబ్బరికాయఅమ్మకం తాలూకు డబ్బులు తీసికొని, చిల్లరకోసం గల్లాపెట్టె కెలుకుతూ, అలా వోకగా "ఊఁ!" అన్నది. ఆ "ఊఁ!"ను హామీగా తీసుకొని, క్యూలో నిలబడ్డాడు నరసింహయ్య.

కాని క్యూ ఎంతకూ ముందుకు కదలడంలేదు. కొంతమంది క్యూ మొహంకేసి చూడకుండానే సొంత ఇంటిలోకి వెళ్లినట్లుగా దేవాలయంలోకి నేరుగా వెళ్ళిపోతున్నారు. 'వాళ్ళంతా ప్రత్యేక దర్శనాసక్తులు కాబోలు!' అనుకున్నాడు నరసింహయ్య. ఒక్క రూపాయి పెడితే అర్చన టిక్కెట్టు ఇస్తారు. ఆ టిక్కెట్టు పుచ్చుకుని స్వామివారి సన్నిధికి వెళ్ళి ఎంతసేపైనా నిలబడవచ్చు. నామమూ, గోత్రముతో పాటు నాలుగు మంత్రాలు కూడా ఉచ్చరిస్తారు పూజారులు. కాని ఆ పద్ధతి దొడ్డిదోవగా కనబడ్డది నరసింహయ్యకు. ఏడుకొండలూ ఎక్కి, క్యూలో ఏడు గంటల సేపు నిలబడి వెంకటేశ్వర స్వామివారి ధర్మదర్శనం చేసుకున్న పుణ్యం, టుప్‌టుప్‌మంటూ కారులో వెళ్ళి, పదమూడు రూపా

యలు పెట్టి టికెక్కట్టుకొని, పక్కగా గర్భగుడిలో ప్రవేశించి, ఆ మొక్కు తీర్చుకొనే వారికి వస్తుందా? 'మనలో సహానాన్ని స్వామివారు పరీక్షిస్తారు!' అనుకున్నాడు నరసింహయ్య.

క్యూలో నిలబడ్డాడన్న మాటేగానీ నరసింహయ్య నేత్రా లన్నీ తన కొత్త చెప్పుల జతమీదే ఉన్నాయి. ఆ క్యూ దేవా లయం ముఖద్వారం వచ్చేవరకూ ఆ చెప్పులకేసి కళ్లతో చూస్తూనే ఉన్నాడు. ఆ తరవాత మనస్సులో చూడసాగాడు.

మూల విరాట్టు దగ్గిరికి వెళ్ళేసరికి గంట పట్టింది. సర్వాలం కార విభూషితుడైన స్వామివారిని కన్నుల పండువుగా దర్శించి, ధ్యానించి, దణ్ణం పెట్టుకున్నాడు. కాని ఒక చెంపన మనస్సు చెప్పులపైనే లగ్నమై ఉంది. అవి అక్కడే వున్నాయో, ఎవ రైనా దొంగలు ఎత్తుకు వెళ్ళారో!

స్వామివారి దర్శనం చేసుకున్న మరుక్షణమే ఆదరా బాదరా బయటికి వచ్చాడు నరసింహయ్య, ఆ కొబ్బరికాయల కొట్టు దగ్గరికి పరిగెత్తాడు.

కాని ఆ కొత్తచెప్పులజత అక్కడలేదు.

నరసింహయ్య గుండె గుభిల్లన్నది.

కొట్టుగలావిణ్ణి గట్టిగా అడిగాడు.

"నాకేటి తెలుస్తాది, బాబూ! ఓ డెత్తికెళ్ళాడో! నా బేరంతో నాకు ఊపిరాడక చత్తున్నా" అన్నదావిడ.

పక్కనే చెప్పుల కాపలా దుకాణం తెరిచిన కుర్రవాణ్ణి అడి గాడు. "మీరు నా దగ్గిర పెట్టలేదుగా! నాకేం తెలుసు?" అన్నాడా కుర్రవాడు ఎదురుప్రశ్న వేస్తూ.

ఇంక నరసింహయ్య ఎవరితో చెప్పుకోనేటట్టు! కొంచెం సేపు గిటగిట పళ్ళు కొరుకుతూ గోవింద గంతులువేసి, ప్రయో

జనం లేకపోగా, దిగులుతో ఇంటిదారి పట్టాడు. రెండు పైసల దగ్గిర బేరం కుదరక, మూడు పైసలకు వెనకాడి, మూడు అయిదుల పదిహేను రూపాయల కొత్త చెప్పులకు నీళ్ళు వదులుకున్నాడు! తనను తను నిందించుకున్నాడు నరసింహయ్య.

పొద్దు బాగా ఎక్కింది.

నరసింహయ్య తన ఇంటి వరండా మెట్టుమీద అడుగు పెట్టేసరికి, ప్రాణం ఒక్కసారి లేచి వచ్చింది. అంతకుమునుపు దట్టమైన మేఘాల్లా మొహంమీద ముద్రితమైన దిగులంతా హఠాత్తుగా చెదిరిపోయింది. ఆయన చెప్పులు ఇంటి గడప చెంతనే పెట్టి ఉన్నాయి.

ఆశ్చర్యం! అద్భుతం! అసాధ్యం! గుడి దగ్గిర పోయిన చెప్పులు ఇక్కడికెట్లా నడిచి వచ్చాయి? ఆ స్వామివారి లీలా విలాసం కాదుగదా!

గబుక్కున ఆ చెప్పుల్ని చేతులతోకి తీసుకొని పట్టి పట్టి చూశాడు. అచ్చు తన చెప్పులే! పాతబాకీ వసూలైనంత సంతోషంతో ఆయన మొహం పొద్దు తిరుగుడు పువ్వులా వికసించింది. ఇది కలియుగపు మాయా, మహిమా!

"ఈ చెప్పులెక్కడ దొరికాయిరా?" అన్నాడు నరసింహయ్య ఇంటిలోంచి బయటికి వస్తున్న పెద్ద కొడుకుతో.

పెద్దకొడుకు రవ్వంతసేపు ప్రాన్పడ్డాడు.

"ఇవి నా చెప్పులేరా! నిన్న సాయంత్రం కొన్నానా! ఇవాళ పొద్దున గుడికి తొడుక్కెళ్ళాను. స్వామివారి దర్శనం చేసుకొని వచ్చేసరికి బయట చెప్పులు కాస్తా మాయగా మాయమైనాయి. ఏడ్చుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి వచ్చాను. చూస్తే ఇక్కడున్నాయి" అన్నాడు నరసింహయ్య

పొంగిపోతూ.

పెద్దకొడుకు మొహంలో రంగులు దళసరిగా మారాయి. అప్పటికప్పుడే ఆ మొహంలో అద్భుతమైన ఆశ్చర్యాన్ని రప్పించి, "ఆ చెప్పులు పొద్దుటినించి ఇక్కడే ఉన్నాయి గదా, నాన్నా! గుడికి నువ్వు వేసుకెళ్లలేదు" అన్నాడు.

నరసింహయ్యకు మతి పోయింది. తల అంతా బొంగరంలో గింగిరాలు తిరిగింది. తనకు తనే అనుమానం వచ్చింది. ఏది నిజం? ఏది నిజంకాదు? కలా, వాస్తవమా? తను చెప్పుల్ని తొడుక్కెళ్ళాడు. ఆ చెప్పులతోనే నడిచాడు. ఆ చెప్పుల్ని ఆ కొట్టు దగ్గిర విడిచాడు. గుడినుంచి బయటికి వచ్చేసరికి ఆ చెప్పులులేవు. ఇది భౌతికమైన సత్యం. అయితే ఆ చెప్పులు ఇక్కడికెట్లా వచ్చాయి? భగవంతుని మాయా?

"నేను చెప్పులు వేసుకెళ్ళానురా!" అన్నాడు నరసింహయ్య తనను తను నమ్మటానికి ప్రయత్నిస్తూ.

"లేదు, నాన్నా! పొద్దుటినుంచీ నేను చూస్తూనే ఉన్నానుగా!" అన్నాడు పెద్దకొడుకు.

నరసింహయ్య ఓ గావుకేక పెట్టి భార్యను పిల్చాడు. ఆవిడ వంటగదిలోంచి అట్లకాడతో సహా ఆవురావురు మంటూ వచ్చింది.

"ఒసేవ్! ఆ అట్లకాడతో నా డొక్కలో ఒక్క పోటు పొడువు! నేను ఏ లోకంలో ఉన్నానో తెలుసుకోవాలి!" అన్నాడు నరసింహయ్య. ఆవిడ అమితంగా అక్కజపడుతూనే అట్లకాడను ఆయన వంటికి తాకించింది. నొప్పితో "అబ్బా!" అన్నాడు నరసింహయ్య.

"ఇది భ్రమ కాదు. వాస్తవమే!"

పెద్దకొడుకు అట్టహాసం పట్టపగలుగా నవ్వాడు.

"నీ చెప్పులు పోలేదు, నాన్నా! నీ అంత జాగ్రత్తమనిషి చెప్పుల్ని పోగొట్టుకున్నాడంటే దేవుడుమటుకు నమ్ముతాడా! ఏదో మతికాస్త చలించి, మృగతృష్ణలో పడ్డావు" అన్నాడు పెద్దకొడుకు.

'నిజమంటే ఏమిటి?' అన్న మీమాంసలో పడి నిలువు కాళ్ల మీద నిలబెట్టిన ప్రతిమలా నిలబడి పోయాడు నరసింహయ్య.

బడేచావడీలో ఉన్న బట్టల దుకాణాన్ని తెరవడానికి పెద్ద కొడుకు బయలుదేరాడు ఉదయం తొమ్మిది ఇరవై నిమిషా లకు. ఇవాళ నాన్న తృప్తికోసం తను అయిదు రూపాయలు ఖర్చు పెట్టాడు. కొత్తచెప్పులు చవగ్గా వస్తున్నాయని చెప్పి, గంట క్రితమే ఓ హోటల్ దగ్గిర ఓ కుర్రాడు అమ్ముతూంటే అయిదు రూపాయలిచ్చి కొన్నాడు. 'అవి నాన్న పోగొట్టు కున్న చెప్పులని తనకేంతెలుసు? ఈ అయిదు రూపాయలనూ చిల్లర నగదు చిట్టాలో చిల్లర మల్లర పద్దు క్రింద వ్యయంగా వ్రాసుకోవాలి!' అనుకున్నాడు నరసింహయ్య పెద్దకొడుకు సిటీబస్సు ఎక్కుతూ.

(ఆంధ్రప్రభ)

———